


# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఉమ్మడి వరంగల్

హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

శుక్రవారం | 15 | ఆగస్టు | 2025 | పేజీలు : 17


## పాలన సౌలభ్యం కోసమే
# కొత్త సర్కిల్ గా గణపురం

ప్రజలకు సౌకర్యవంతంగా పోలీస్ సేవలు

రేగొండ గోరి కొత్తపల్లి ని కలుపుకొని సర్కిల్ ఏర్పాటు

పారిశ్రామిక, పర్యాటక రంగంతో గణపురం మండలం మరింత అభివృద్ధి



7 లో

## స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి

ముగ్గురు విద్యార్థులకు కరెంట్ షాక్

2 లో

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



# వేడుకలకు సర్వం సిద్ధం

## ముస్తాబైన పరేడ్ మైదానం... మువ్వన్నెల జిగేల్





**సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, ఆగస్టు 14, మేజర్ న్యూస్:** పంద్రాగస్టు వేడుకలకు ఉమ్మడి జిల్లా సిద్దమైంది. నేడు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు అంబరాన్నంటనున్నాయి. గురువారం రాత్రి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ల కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు మిగతా 2లో..



7 లో

## పిఎసిఎస్ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పాత్ర కీలకం

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు

ప్రజలు ముందుకు రావాలి

జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



2 లో








## కాంగ్రెస్ అంటేనే కరువు

ఎరువులు అందివ్వడంలో కాంగ్రెస్ విఫలం

రేవంత్ సర్కార్ కు బుద్ధిచెప్పడానికి రైతులు సిద్ధం

వినాయక చవితి తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు

కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

ఎప్పటికీ ప్రజలకు అండగా బీఆర్ఎస్

మాజీ మంత్రి - తన్నీరు హరీష్ రావు

2 లో




# కాంగ్రెస్ అంటేనే కరువు



గీసుగొండ ఆగస్ట్ 14 మేజర్ న్యూస్ (సూర్య)కాంగ్రెస్ అంటేనే కరువని,రైతులకు సకాలంలో ఎరువులు అందివ్వలేని పరిస్థితి వచ్చిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు.గురువారం గీసుగొండ మండలం కొనాయిమాకుల గ్రామంలో మాజీ జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు నివాసంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి కార్యకర్తలతో సమావేశమయ్యారు.ఎరువుల కొరతపై,రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడగగా..సరైన సమయంలో పంటలకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీళ్ళివ్వక..కావాల్సిన ఎరువులు అందివ్వక పోవడం వల్ల సొసైటీలలో కూర్చోలేక పోతున్నామని సొసైటీ చైర్మన్లు హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరువని రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని అన్నారు.రైతులకు అప్పుడు ఇప్పుడు అండగా బిఆర్ఎస్ ఉంటుందని తెలిపారు.వచ్చే వినాయక చవితి తర్వాత స్థానిక సంస్థ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలా ఉందని కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను తిప్పికొట్టాలని యువతకు సూచించారు.ఈ సమావేశం లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్,సతీష్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ చింతం సదానందం, చల్లా వేణుగోపాల్ రెడ్డి,రఘుపతి రెడ్డి,గోలి రాజయ్య,గూడ సుదర్శన్ రెడ్డి,మాజీ సర్పంచులు బోడకుంట్ల ప్రకాష్,జయపాల్ రెడ్డి,నాగేశ్వర రావు, ముంత రాజయ్య,యూత్ నాయకులు సిరిసే శ్రీకాంత్,మంద రాజేందర్,మున్నా,నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి

### ముగ్గురు విద్యార్థులకు కరెంట్ షాక్

### త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



మహాదేవపూర్ ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి.. ముగ్గురు విద్యార్థులకు కరెంట్ షాక్ తగిలిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది ముగ్గురు విద్యార్థులకు, అటెండర్కు కరెంట్ షాక్ తగిలింది. స్వాతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకోగా.. నలుగురిని ఆసుపత్రికి తరలించారు.



గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఏర్పాట్లలో జండా కర్ర విద్యుత్ తీగలకు తగలడంతో అకస్మాత్తుగా ఇనుప జెండాకు విద్యుత్ ప్రవహించి షాక్ తగలిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు,ఒక అటెండర్ విద్యుత్ షాక్ కు గురై త్రుటిలో ప్రాణాపాయంతో గాయాలపాలై బయటపడ్డారు. గాయాలపాలైన విద్యార్థులను మహాదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ఒక విద్యార్థికి తీవ్రమైన గాయాలు అవడంతో మెరుగైన చికిత్స అందించేందుకు జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు.స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే పనులను విద్యార్థులతో పని చేయించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు ఉపాధ్యాయుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా వివిధ అవసరాలు కార్యక్రమాలకు వచ్చే నిధులతో చేయించాల్సిన పనులను విద్యార్థులతో చేయించడం సరికాదని అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

# వేడులకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి..

విద్యుత్ దీపాలం కరణలో తళుకులీనుతూ కనిపించాయి. అదేవిధంగా పంద్రాగస్టు వేడుకలకు ఉమ్మడి జిల్లా కేంద్రం లోని పరేడ్ మైదానాలు ముస్తాబైనాయి. ఈ మేరకు యంత్రాంగం ఏర్పాట్లో నిమగ్నమైంది. పోలీసు ల కవాతు, విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలకు వీలుగా మైదానాన్ని చదును చేసి రంగు వల్లులతో తీర్చిదిద్దారు. జాతీయ పతాకం ఆవిష్కరించే ప్రాంతంలో పాటు ముఖ్య అతిథులు ఆసీను లయ్యే వేదికను రంగులతో సుంద రీకరించారు. ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, అధికారులు కూర్చునేం దుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సంక్షేమ, అభివృద్ధి కా ర్యక్రమాల ప్రగతి తెలియ చేసేలా స్టాళ్ల ఏర్పాటు కు గాను శాఖల వారీగా టెంట్లు వేశారు. పతాకావిష్కరణ అనంతం మంత్రులు, ప్రముఖులు పోలీసు ల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించ నున్నారు. ఆనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందచేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్ల ను కలెక్టర్లు, అధికారులు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు





తలెత్తకుండ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లాల వారీగా...

ఉమ్మడి వరంగల్ లో జిల్లాల వారీగా వేడుకలకు హాజరయ్యే మంత్రులు, ప్రముఖుల జాబితాను ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు విడుదల చేశారు. హనుమకొండ జిల్లా పోలీస్ పరేడ్ గ్రాండ్స్ లో మంత్రి కొండా సురేఖ, వరంగల్ లో రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ములుగులో మంత్రి సీతక్క, మహబూబాబాద్ లో డిప్యూటి స్పీకర్ జె. రామచంద్రు నాయక్, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జయశంకర్ భూ పాలపల్లి లో ఎస్ టి కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. ఆనంతరం గార్డ్ ఆఫ్ ఆనర్ లో గౌరవ వందనం స్వీకరిస్తారని ఆ ఉత్తర్వులలో సూచించారు.

# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల పాత్ర కీలకం

**ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి**

**అందరూ సహకరిస్తేనే నేరాలు నియంత్రించడం సాధ్యపడుతుంది**

**జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**జిల్లా కేంద్రంలో దాతల సహకారంతో 160 సీసీ కెమెరాలు ఏర్పాటు**

భూపాలపల్లి సూర్య ప్రతినిధి 14 మేజర్ న్యూస్:నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే , భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా కేంద్రంలోనీ వ్యాపార సముదాయాలు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వివిధ వ్యాపార సంస్థలు, జెన్ కో సహకారంతో ఏర్పాటు చేసిన 160 సీసీ కెమెరాలను ఎస్పీ కిరణ్ ఖరే , ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెన్కో, జిల్లా కేంద్రంలోని వివిధ వ్యాపార వాణిజ్య, దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. నేరాలను తక్షణమే పరిష్కారించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. భూపాలపల్లి జిల్లాలో గతంలో ఉన్న సిసి కెమెరాల కన్నా అత్యంత ఆధునిక టెక్నాలజీతో కూడిన కెమెరాలు ఏర్పాటు చేశామని రేగొండ నుండి కాళేశ్వరం వరకు నిఘా సీసీ కెమెరాల ద్వారా ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు








మాట్లాడుతూ సీసమాట్లాడుతూ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలనీ నేరాల అదుపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. మిస్టరీ కేసులను చేధించటంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పట్టణంలోనే కాదు గ్రామాల్లో సైతం నేరాల కట్టడికి సీసీ కెమెరాలు వినియోగించాలన్నారు. జిల్లా కేంద్రంలో దొంగతనాలు జరుగుతున్నాయని, నేరాలను అరికట్టడానికి సిసి కెమెరాలు చాలా ముఖ్యమని, ప్రతి చోట సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలు అరికట్టడం తొందరగా జరుగుతుందని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు. నాయకులు వ్యాపారవేత్తలు దాతలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ నరేష్ కుమార్, సింగరేణి జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డిపట్టణ ఛాంబర్ అఫ్ కామర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాంచంద్రరావు, డాక్టర్ కిరణ్, డి.ఎస్.పి సంపత్ రావు, సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి




## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, ఆగస్టు 14, మేజర్ న్యూస్ సూర్య: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి హైద్రాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి అన్ని శాఖల అధికారులతో రివ్యూ చేసి పలు ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యం లో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తు.చా. తప్పకుండ పాటించాలని, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు వారి పరిధిలో గల విధులను బాధ్యతలను సజావుగా నిర్వర్తించాలన్నారు. విధులలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవన్నారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాల న్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు హెడ్ క్వార్టర్ మెయింటైన్ చేయాలని, వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. కరెంట్ స్తంభాలు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రధాన రహదారి వద్ద నీరు ఎక్కడ అయిన ఆగిపోతే వెంటనే స్పందించాలన్నారు. శిథిలావస్థ భవనాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా బయటకు రాకుండా చూడాలని, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఇండ్ల నుండి బయటకు వచ్చి ఇబ్బందులు పడకుండా, టామ్ టామ్ వేపించి ప్రజలను అలర్ట్ చేయాలన్నారు. పొంగి పోర్లే వాగుల వద్ద ఎవరు వెళ్లకుండా చూడాలని, వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధులు ప్రబల కుండ జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే స్పందించేందుకు కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ 24/7 పని చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూమ్కు 1800 425 3424, 9154252936 సమాచారం అందించాలాని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, సమస్యలను తక్షణమే తెలియజేయలని, అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో జెడ్పి సీఈఓ రామీరెడ్డి, డి ఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిపిఓ కల్పన, డిఎఓ అనురాధ, ఎన్పిడిసిల్ ఎస్ ఈ గౌతమ్ రెడ్డి, ఎన్డిఆర్ ఎఫ్ ఇన్స్పెక్టర్ రవి, ఎస్డీఆర్ఫ్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ కుంట పనులు వేగవంతం చేయాలి

## జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ జిల్లా సూర్య ప్రతినిధి, ఆగస్టు 14, మేజర్ న్యూస్ సూర్య: జనగామ పట్టణం లోని మునిసిపాలిటీ పరిధిలో రూ. 1.50 కోట్లతో చేపట్టిన బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను గురువారం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి వాకింగ్ ట్రాక్, లైట్స్, చిల్డ్రన్ పార్క్ లను పరిశీలించారు. ముందుగా చెత్త చెదారం తొలగించాలని, ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పనులు వేగవంతంగా చేపడుతూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అందమైన పూల మొక్కలు నాటించాలని, చూపరులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టర్ వెంట ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ రావు, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా భారత స్వాతంత్ర్య దినోత్సవం

## స్వాంతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లను పరిచిలించిన ఇంచార్జీ కలెక్టర్

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఆగస్టు 15, మేజర్ న్యూస్ (సూర్య): భారత స్వాంతంత్ర్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించాలని గురువారం జిల్లా ఇంచార్జీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు. మహబూబాబాద్ పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలో జరుగనున్న 79,వ భారత





స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్లు అందుకు తగిన విధంగా ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అతిథులకు ప్రతి ఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను



ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే స్వాంతంత్ర్య సమరయోధులకు, అతిధులు, ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు సమకూర్చాలని, వివిధ డిపార్ట్మెంట్ లకు సంబంధించి స్టాల్స్ ను సిద్ధం చేయాలని, సాంస్కృతిక ప్రదర్శనలు కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎలాంటి ఇబ్బందులు లేకుండా షెడ్యూల్ ప్రకారం ప్రతి ఒక్కరు సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్ రెవిన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా నాయక్, డి.ఈ.ఓ డా. రవీందర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి మరియన్న, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసిల్దార్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## అధైర్య పడవద్దు

### జిల్లా యంత్రాంగం అండగా ఉంది

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: పునరావాస కేంద్రంలో ఉన్న వారు అధైర్య పడవద్దని జిల్లా యంత్రాంగం అండగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ నగరంలోని జలమయమైన లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన్ కాలనీ నిర్వాసితులకు పోతన రోడ్ లోని మరాఠీ భవన్లో నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సందర్శించి అందుతున్న తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పునారావస కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదని, జిల్లా యంత్రాంగం అహర్నిశలు ప్రజల రక్షణ కోసం పాటుపడుతుందని తెలిపారు. ఎవరు ఆందోళన చెందకూడదని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ ఇక్బాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి





### అత్యవసరమైతేనే బయటకు రావాలి

### శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదు

### ప్రజలందరూ సురక్షితంగా ఉండాలి

### క్షేత స్థాయిలో అధికారులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం గా ఉంచాలి

### ప్రాణ, ఆస్తి నష్టం జరగనీయరాదు : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

రఘునాథ పల్లి, ఆగస్టు 14, మేజర్ న్యూస్ సూర్య: భారీ వర్షాలను దృష్టి లో పెట్టుకొని వాతావరణ శాఖ చేసిన భారీ వర్షసూచన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం రఘునాథపల్లి మండలంలోని బాణాజి పేట, రఘునాథపల్లి లలో పర్యటించారు.వరద తో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలను పరిశీలిస్తూ తహసీల్దార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిల భవనాల్లో, మట్టి ఇండ్లలో, రేకుల షెడ్ లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. దోమలు ప్రబలే అవకాశం ఉన్నందున సీజనల్ వ్యాధులు సోకకుండా, డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి జ్వరాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో మాట్లాడారు. వర్షాలకు తడిసిన కరెంట్ స్తంభాలు తాకరాదని, వాగులు దాటరాదని,కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ 24/7 ఏర్పాటు చేయడం జరిగిందని, విపత్కర పరిస్థితులల్లో కంట్రోల్ రూమ్ నెంబర్ కు 9052308621 సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఫణి కిషోర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హనుమకొండ సూర్య ప్రతినిధి, ఆగస్టు 14, మేజర్ న్యూస్: వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురిసే భారి నుంచి అతి భారీ వర్షాల వల్ల ఎక్కడ ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యూరియా నిల్వల పై సీఎస్ కే. రామ కృష్ణా రావు తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశానికి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2 రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు రాష్ట్రంలోనే కొన్ని ప్రాంతాలలో కురుస్తున్నాయని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు.వరద పరిస్థితుల పై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలకు ఎక్కడ ఆస్తి నష్టం ప్రాణ నష్టం జర్గకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయలను ప్రభుత్వం విడుదల చేసిందని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా విడుదల చేస్తామని అన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తి స్థాయిలో తీసుకోవాలని అన్నారు. సిఎస్ కే.రామ కృష్ణా రావు మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం తూర్పు, దక్షిణ ప్రాంతాలలో రెడ్ అలర్ట్ జారీ చేసిందని అన్నారు. మిగిలిన ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిందని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో కలెక్టర్ వద్ద ఉన్న డిజాస్టర్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని సీఎస్ సూచించారు. వరద అంచనా వేస్తూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా అధికారులు పనిచేయాలని సిఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, చెరువుల సమీపంలో గల రోడ్లు, కల్వర్ట , వంతెనలను మూసి వేయాలని అన్నారు.





పట్టణ ప్రాంతాలలో కొన్ని కాలనీ లలో ఇండ్లకు నీళ్లు వచ్చే అవకాశం ఉందని, అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రజల అవసరమైతేనే బయటకు రావాలని అన్నారు. రాష్ట్రంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో సాగు విస్తీర్ణం పెరుగుతుందని, రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో పెట్టాలని, ఎక్కడ ఎటువంటి లోటు పాట్లు ఉండకుండా చూసుకోవాలని అన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, కె నారాయణ, జిల్లా అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరదల్లో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు

**వరద సహాయక చర్యల కోసం**

**జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయలు విడుదల**

**భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రులు**

**పొంగులేటి శ్రీనివాస్, తుమ్మల నాగేశ్వరరావు**

ములుగు, సూర్య ప్రతినిధి ఆగస్టు 14 (మేజర్ న్యూస్): వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురిసే భారి నుంచి అతి భారీ వర్షాల వల్ల ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబం ధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సీఎస్ కే. రామకృష్ణారావు తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 2 రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో కురుస్తున్నాయని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వరద పరిస్థితుల పై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలకు ఎక్కడ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా







విడుదల చేస్తామని అన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని అన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తిస్థాయిలో తీసుకోవాలని అన్నారు. రోడ్ డ్యామేజ్, క్యాజ్ వే ల డ్యామేజ్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్స్ ల డ్యామేజ్ ఉంటే వెంటనే చేపట్టాలన్నారు. వైద్యపరంగా అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి ఎటువంటి సెలవులు ఇవ్వరాదని, సెలవుల్లో ఉన్న వారిని రీకాల్ చేయాలని మంత్రి తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు ఒక ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారిని నియమించి, పర్యవేక్షణ చేస్తున్నట్లు అన్నారు. ఎక్కడ అనుకోని సంఘటనలు జరిగిన ఎస్డిఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్ బృందాలను ప్రాపర్ గా వినియోగించాలన్నారు. వచ్చే వరద పరిస్థితి ముందుగా తెలుసుకుంటే, నష్ట నివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టవచ్చని అన్నారు. ప్రభుత్వం ఎట్టి పరిస్థితి నైనా ఎదుర్కొనడానికి సన్నద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ స్థాయిలో పరిష్కరించే సమస్యలు ఉంటే పరిష్కరించాలని, ఆపై ఉన్నతాధికారులకు పంపితే త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని మంత్రి అన్నారు. సిఎస్ కే. రామ కృష్ణారావు మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిందని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో మంగళవారం 49 ఎంఎం వర్షపాతం నమోదైందని, వెంకటాపురం, మంగపేటలో ఎక్కువ వర్షపాతం 160 ఎమ్ ఎమ్ నమోదైందని, మంగపేట లోతట్టు ప్రాంతం కమలాపురంలో వర్షం నీరు రావడం జరిగిందని తెలిపారు. 45 నిమిషాలలో నీరును క్లియర్ చేయించడం జరిగిందనీ అన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో ముందస్తు సన్నద్ధతో యంత్రాంగం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఇర్రిగేషన్ సిఈ కుమార స్వామి, జిల్లా పంచాయతీ అధికారి దేవ్ రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. గోపాల్ రావు, పలు శాఖల తదితరులు పాల్గొన్నారు.

# చెరువు మత్తడిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

సంగెం, ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సంగెం మండలంలోని ఏలుగూరు రంగంపేట చెరువు మత్తడిని పరిశీలించి వరద ప్రభావం ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చెరువు నీటి నిల్వ, మత్తడి పరిస్థితి, నీటి ప్రవాహక మార్గాలు అధికారులు అడిగి తెలుసుకుని మత్తడి లో బలహీనమైన ప్రాంతాలు, గండి ప్రమాదాలు ఏర్పడే అవకాశాలపై అధికారులు ఎప్పటికప్పుడు నిఘా వహించాలన్నారు. జల వనరుల పరిరక్షణతో పాటు, ప్రాణాలు ఆస్తులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ఈ సందర్భంగా అధికారులతో కలిసి మత్తడి వెంట నడుచుకుంటూ కలెక్టర్ పలు కీలక ప్రాంతాలను పరిశీలించారు.మత్తడి ప్రవహిస్తున్నందున కట్టపై ఎలాంటి వాహనాలు ప్రజలు నడవకుండా, పిల్లలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు .అనంతరం రైల్వే ట్రాక్ అండర్ పాస్ వద్ద వరద నీటి నిల్వను, రిటైనింగ్ వాల్స్ లను, స్లాబ్, మురుగు నీటిని కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా రైల్వే అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట



ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత, డి ఈ గణేష్ జే ఈ హమీద్ తదితరులు పాల్గొన్నారు.







# స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని జిల్లాకలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ ఖుష్ మహల్ లో నిర్వహించనున్న అధికారిక కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద డిసిపి లు అంకిత్ కుమార్, షేక్ సలిమా, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పందిరులు, మైదాన సదుపాయాలు, వేదిక ఏర్పాటు, గ్యాలరీలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. సంబంధిత శాఖల అధికారులతో ప్రతి అంశాన్ని శ్రద్ధగా సమీక్షించి, సమర్ధవంతమైన నిర్వహణకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర దినోత్సవం ప్రతి ఒక్కరికి గర్వకారణమైన రోజని, ఈ వేడుకలు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొనను న్న విద్యార్థులకు తాగునీరు, వైద్య సహాయం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్య అతిథుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, శబ్ద వ్యవస్థ, జాతీయ జెండా ఆవిష్కరణకు అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. వేదిక సమీపంలోని ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను కూడా పరిశీలించిన కలెక్టర్ స్థానిక పోలీసు మరియు ట్రాఫిక్ అధికారులతో చర్చించి తగిన మార్గ దర్శకాలను జారీ చేశారు. కార్యక్రమంలో ఏసీపీ శుభం, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రేడిసి, మున్సిపల్ పోలీసు ఉన్నతాధికారులు, విద్యుత్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.



# భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే**

**కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి**

**క్షేత్రస్థాయి లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**అత్యవసర పరిస్థితులు అయినందున సెలవులు రద్దు**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు, సూర్య ప్రతినిధి ఆగస్టు 14 (మేజర్ న్యూస్): ములుగు, సూర్య ప్రతినిధి ఆగస్టు 14 (మేజర్ న్యూస్) రానున్న రెండు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భారీ వర్ష సూచనల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా, సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అన్ని విధాలుగా సన్నద్ధం అయి ఉండాలని సూచించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, మూగ జీవాలు ప్రాణాలు కోల్పోకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగుల సెలవులు రద్దు చేస్తున్నామని, అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విధుల్లో ఉంటూ, అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ



యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని హితవు పలికారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, వైద్యారోగ్య, ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాల శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు రాబోయే రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉంటూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూ, తగు జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. రానున్న రెండు రోజులు పాటు అవసరం ఉంటేనే ఇళ్ళ నుండి బయటకు రావాలని సూచించారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తిస్తూ, అవసరమైన సమయంలో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అక్కడికి తరలించి ఆహారం, ఇతర సదుపాయాలు సమకూర్చేలా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాలతో వరద జలాలు ఏర్పడి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని పీ.హెచ్.సీలు, ఆసుపత్రులలో సరిపడా మందుల స్టాక్ ను అందుబాటులో పెట్టుకుని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా అప్రమత్తమై ఉన్నదని, ఎలాంటి పరిస్థితులు తలెత్తిన సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని, ప్రజలు ఆందోళనకు గురి కావద్దని కలెక్టర్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా తక్షణ సహాయం కొరకు కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109 కు కంట్రోల్ రూమ్లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి, జలమాయమైయ్యే ప్రాంతాల సమస్యకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వరద ఉధృతి ఎక్కువ అయితే వెంటనే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రజలు సహకరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.



# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

జనగామ జిల్లా సూర్య ప్రతినిధి, ఆగస్టు 14, మేజర్ న్యూస్ సూర్య: ఆగస్టు 15 వ తేదీన 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం జనగామ పట్టణంలోని ధర్మ కంచ మినిస్టేడియం లో చేపడుతున్న ఏర్పాట్లను డి.సి.పి.రాజమహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పర్యవేక్షించారు.స్టేజి, గ్యాలరీ ఏర్పాట్లు, జాతీయ పతాకం ఆవిష్కరణ, పరేడ్, ప్రశంస పత్రాల పంపిణీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణ, స్టాల్స్ ఏర్పాట్లు వంటివి సందర్శించి పరిశీలించారు. ఆద్యంతం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ గోపిరామ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వాహన మరమ్మత్తులపై డ్రైవర్లకు ప్రాథమిక అవగాహన అవసరం




**నగర మేయర్ గుండు సుధారాణి**

**బల్దియా చెత్త తరలింపు వాహన డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం**

**టాటా కంపెనీ ప్రతినిధులచే అవగాహన**

వరంగల్ టౌన్, ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: వాహన మరమ్మత్తులపై డ్రైవర్లకు ప్రాథమిక అవగాహన అవసరం అని నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో టాటా వాహన కంపెనీ ప్రతినిధులచే చెత్త తరలింపు వాహన డ్రైవర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం లో మేయర్ పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకొనుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ డ్రైవర్ లకు వారికి కేటాయించిన వాహన మరమ్మతుల ప్రాథమిక అంశాల పై అవగాహన పెంపొందించు కోవడానికి ఓరియెంటేషన్ ప్రోగ్రాం ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు డైవర్ల వృతి నైపుణ్యాలను పెంపొందించ డానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కొన్ని విపత్కర పరిస్థితుల్లో వాహనాలు తాత్కాలిక (చిన్న) మరమ్మత్తులకు గురి అయితే వెంటనే డ్రైవర్ స్వయంగా రిపేర్ చేసుకుని చెత్త తరలింపులో జాప్యం కలుగకుండా చూసే అవకాశం ఉంటుందని అన్నారు. వాహన నిర్వహణకు సంబంధించి ప్రతి చెత్త తరలింపు వాహనానికి ప్రత్యేకం గా రిజిస్టర్ ను ఏర్పాటు చేసి అందులో మరమత్తుల సమాచారం సంబంధిత వివరాల తో పాటు వాహన ప్రాథమిక సమాచారం నమోదు చేయడం తో పాటు వాహన పూర్తి సమాచారం ఉండాలని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి ఎస్ ఈ మహేందర్, సి ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ మాధవి లత ,డి ఈ రాజ్ కుమార్, సానిటరీ సూపర్ వైజర్ లు భాస్కర్ ,నరేందర్, గోల్కొండ శ్రీను , ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.



# పాలన సౌలభ్యం కోసమే కొత్త సర్కిల్ గా గణపురం



ప్రజలకు సౌకర్యవంతంగా పోలీస్ సేవలు

రేగొండ గోరి కొత్తపల్లి ని కలుపుకొని సర్కిల్ ఏర్పాటు

పారిశ్రామిక, పర్యాటక రంగంతో

గణపురం మండలం మరింత అభివృద్ధి

రాబోయే రోజుల్లో టూరిజం హబ్ గా ఏర్పాటు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

లాంచనంగా గణపురం నూతన సర్కిల్ ప్రారంభోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ కిరణ్ ఖరే







గణపురం ,రూరల్ ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: పాలన సౌలభ్యం కోసమే గణపురం నూతన సర్కిల్ ఏర్పాటు చేసినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం గణపురం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ తో కలిసి నూతన సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ సిహెచ్ కరుణాకర్ రావు ను కుర్చీలో కూర్చోబెట్టి లాంఛనంగా సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జెన్ కో సింగరేణి గనులతో గణపురం మండలం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణలో నేరాల నియంత్రణకు పోలీస్ శాఖకు గణపురంలో సిఐ కార్యాలయ ఆవశ్యకతను గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి మంజూ చేసినట్లు పేర్కొన్నారు .సీఎం కు కృతజ్ఞతలు తెలిపారు గణపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నివాస భవనాలు అలాగే స్టేషన్ కు కాంపౌండ్ వాల్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను కోరారు భూపాలపల్లి లో ట్రాఫిక్ ఉమెన్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు పారిశ్రామిక కేంద్రమైన చెల్పూర్ నుమునిసిపాలిటీగా మార్చడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు గణపురం మండలం ను టూరిజం హబ్ గా అభివృద్ధి చేయడానికి ఢిల్లీలో కేంద్ర పర్యటక శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు దీంతో రేగొండ మండలం పాండవుల గుట్టలు కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నా పాక దేవాలయాలు మైలారం సున్నపు గుహలు గణపురం కోట గుళ్ళు ,రెడ్డి గుడి గణపసముద్రం సరస్సు లు పర్యటకంగా ఎంతో అభివృద్ధి చెందను న్నాయని అన్నారు అలాగే గణపురం మీదుగా ధర్మరావుపేట భూపాలపల్లి రోడ్డును మంజూరు. చేయించాను అన్నారు. గాంధీనగర్ గుట్టపై పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సత్యనారాయణ రావు వివరించారు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గణపురం సిఐ స్టేషన్ గోరికొత్తపల్లి నూతన పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే ను అభినందించారు జిల్లా ఎస్పీ కిరణ్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో ఆరు మండలాల పోలీస్ స్టేషన్లు ఉండేవని ప్రజలకు సులభంగా తమ పోలీసుల సేవలను అందించడానికి గోరికొత్తపల్లి ,రేగొండ గణపురంలో స్టేషన్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు ప్రజలు సహకరించి పోలీసుల సేవలను పొందాలని కోరారు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ భూపాలపల్లి డిఎస్పి అవిరినేని సంపత్ రావు గణపురం నూతన సీఐ సిహెచ్, కరుణాకర్ రావు, భూపాలపల్లి, చిట్యాల సిఐ లు డి, మల్లేష్ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, గణపురం ఎస్ఐ రేఖ అశోక్, రెండవ ఎస్ఐ అమూల్య, గోరుకొత్తపల్లి, రేగొండ ఎస్ఐ లు దివ్య, సందీప్ కుమార్ లతోపాటు గణపురం తాసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి ఎంపీడీవో భాస్కర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్ రాజేందర్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి కృష్ణయ్య వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, గణపురం సొసైటీ చైర్మన్ కన్నెబోయిన కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థ రహిత సమాజమే మనందరి లక్ష్యం

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్




హనుమకొండ సూర్య ప్రతినిధి, ఆగస్టు 14 మేజర్ న్యూస్: మత్తు పదార్థ రహిత సమాజం కొసం అందరం సమిష్టిగా పనిచేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. గురు వారం నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని కాకతీయ విశ్వవిద్యాలయం సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న కేసులను సమీక్ష జరిపడంతో పాటు పెండింగ్కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసు కోవడంతో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకో వాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకై విద్యా సంస్థల పరిసరాలతో పాటు, నిర్మానుష్య ప్రదే శాలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ అధికారులు వారివారి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ఈ సిగిరెటు వినియోగంపై నిషేధం అమలులో ఉన్నందున ఈ. సిగిరెట్ల వినియోగంపై పోలీ సులు నిఘా పెట్టాలని, గంజాయి కేసుల్లోఅధికారులు ప్రధాన నింది తుల అరెస్టుకై ప్రత్యేక చొరవ చూపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణకై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వా య్యంతో సిసి కెమెరాల ఏర్పాటుకై కృషి చేయడంతో పాటు సిసి కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, మద్యం దుకాణాల్లో తప్పని సరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోనే విధంగా మద్యం దుకాణాల యజమానులను అదేశించాలని తెలిపారు. చోరీ కేసులకు సంబంధించి ప్రస్తుతం పరారీలో నిందితులను పట్టుకొనేందుకుగాను సిసిఎస్ పోలీస్, స్థానిక పోలీసులు సంయుక్తంగా కల్సి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు.



ముఖ్యంగా సిబ్బంది యోగ క్షేమాల పట్ల అధికారులు దృష్టి సారించాలని, వారికి ఏదైనా వ్యక్తిగత లేదా శాఖ పరమైన సమస్య ఉంటే సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని సిపి సూచించారు. సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్కుమార్, వరంగల్, జనగామ ఏఎస్పీలు శుభం, చేతన్నితిన్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్రావు తో పాటు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

# వాహనాల కదలికల సమాచారం అందుబాటులో ఉండాలి

## నగర మేయర్ గుండు సుధారాణి



వరంగల్ టౌన్, ఆగస్టు 14 , మేజర్ న్యూస్ సూర్య: వాహనాల కదలికల సమాచారం అందుబాటులో ఉండా లని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయం లో గల ఐ సి సి సి కేంద్రాన్ని మేయర్ ఆకస్మికం గా తనిఖీ చేసి వాహనాల ట్రాకింగ్ నిర్వహణ తీరును అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ పోతన, బాల సముద్రం లో గల ట్రాన్స్ ఫర్ స్టేషన్ లలో చెత్త ను కోలవడానికి వేవింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాలని, శానిటేషన్ వాహనాల కదలికలకు సంబంధించిన సమగ్ర సమాచారం నిత్యం అందుబాటు లో ఉండాలని ఆదేశించారు. మేయర్ ఎన్ని వాహనాలు చురుకుగా ఉన్నాయి, ఎన్ని చురుకుగా లేవు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ జరగాలని, జీ పి ఎస్ కు సంబంధించి వాహనాలలో మరమత్తులు అవసరం ఉంటే వెంటనే చేయించి పనిచేసేలా చూడాలని సూచించారు. చెత్త తరలింపు వాహనాలు ప్రతి రోజు 3 ట్రిప్పులు తిరిగేలా చూడాలని , చెత్త తరలింపు తర్వాత వాహనాలు శుభ్రం చేసుకోవడానికి వీలుగా నల్లాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్ధారణకు ఆ ప్రాంతం లో సి.సి కెమెరాలు, సెన్సార్లు ఏర్పాటు చేసి ఐ సి.సి సి కి అనుసంధానం చేయాలని, ఫిల్టర్ బెడ్ లలో సి సి కెమెరాల ఏర్పాటు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐ టి మేనేజర్ రమేష్, ఐ సి సి సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పిఏసిఎస్ పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

## మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సూర్య బ్యూరో ఉమ్మడి వరంగల్, ఆగస్టు 14 ,మేజర్ న్యూస్ సూర్య: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పిఏసిఎస్) పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు పై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. గురువారం పిఏసిఎస్ ల పాలకవర్గాల పదవీకాలం గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

**వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి**

**సీజనల్ వ్యాధుల నియంత్రణ పర్యవేక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి**

**సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వైద్య సదుపాయాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన వైద్యాధికారులతో ప్రత్యేకాధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సమీక్ష**



హనుమకొండ సూర్య ప్రతినిధి, ఆగస్టు 14 మేజర్ న్యూస్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలను అందించాలని సీజనల్ వ్యాధుల నియంత్రణ పర్యవేక్షణ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వైద్య సదుపాయాలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వివిధ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. హనుమకొండ జిల్లాకు డెడికేటెడ్ కలెక్టర్ గా స్నేహ శబరీష్ ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కు సీజనల్ వ్యాధుల నియంత్రణ, పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా తనను నియమించిందని పేర్కొన్నారు. బుధవారం రోజున హనుమకొండ జిల్లా పరిధిలోని వంగపహాడ్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని తెలిపారు. అదేవిధంగా సిద్దాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. గ్రామాలు, వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని, మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు సిబ్బంది అప్రమత్తం గా ఉండాలన్నారు. డెంగ్యూ కేసుల పట్ల ఇక్కడి వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు ఎంతో బాగున్నాయని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలలో గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేయాలని సూచించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధుల నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఎవరైనా సీజనల్ వ్యాధుల బారిన పడినట్లయితే అలాంటి వారిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్సను అందించాలని తెలిపారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని వైద్యాధికారులకు సూచించారు. హెచ్ఐవి నియంత్రణలో భాగంగా అనుమానిత లక్షణాలతో ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు చేయించి వారి జీవన ప్రమాణాన్ని పెంచే విధంగా కృషి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి పేషెంట్లకు వైద్య సేవలు అందించాలని, క్షేత్రస్థాయిలో వైద్య శిబిరాలను నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో డ్రై డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశాలు, ఏఎన్ఎంలతో గ్రామాలలో ఫీవర్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ డెంగ్యూ కేసులు ఉన్నచోట్ల ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వైరల్, ఫీవర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు జనవరి నుండి ఇప్పటి వరకు మలేరియా పాజిటీవ్ ఒక కేసు, డెంగ్యూ పాజిటివ్ కేసులు 48 వరకూ నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరం 182 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. డీపీవో లక్ష్మి రమాకాంత్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో ఉన్న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించినట్లు తెలిపారు. మురుగు నీరు నిలవకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఆయిల్ బాల్స్ వేస్తున్నామని, దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ బాగుండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహన్, వివిధ ఆసుపత్రుల వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

## లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ, ఆగస్టు 14, మేజర్ న్యూస్ సూర్య: హనుమకొండ లష్కర్ సింగారంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఎంత మందిని పరీక్షించారు. ఈహెచ్ఎంఐఎస్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేసిన వివరాలను కలెక్టర్ వైద్యాధికారి డాక్టర్ హైదర్ ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ- ఔషదీ పోర్టల్ లో నమోదు చేసిన మందుల వివరాలను , సెంట్రల్ మెడికల్ స్టోర్ నుంచి అందుకున్న మందుల వివరాలను, ఇష్యూ చేసిన వివరాలను అలాగే స్టోర్ లో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. టీబీ ముక్త్ అభియాన్ లో ఎంత మందిని పరీక్షించారు , ఏ ఏ హై రిస్క్ గ్రూపుల వారిని పరీక్షించారు, వారి వివరాల నమోదు, పిహెచ్సిలో నమోదు చేసిన గర్భిణీ ల వివరాలు, ఎన్ సి డి లో బిపీ, షుగర్ నిర్ధారణ, మందుల పంపిణీ , ఫాలో అప్ వివరాలను పరిశీలించారు. టీబీ హై రిస్క్ గ్రూపుల వారికి స్క్రీనింగ్ ఎక్కువ సంఖ్యలో నిర్వహించాలని వైద్యాధికారి, వైద్యులకు సూచించారు.నమోదైనటువంటి గర్భిణీ స్త్రీలకు ఏ సేవలు అందిస్తున్నారు ,అలాగే ప్రసవానంతర సేవలను ఏ విధంగా అందిస్తున్నారనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు.




సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫీవర్ సర్వే నిర్వహించాలని, డ్రై డే కార్యక్రమం పట్ల ప్రజలకు భాగస్వాములను చేస్తూ అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హైదర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వచ్చే 24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

**ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక సీనియర్ అధికారులు**

**భారీ వర్షాలు, సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో రెవెన్యూ, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్**



జనగామ జిల్లా సూర్యప్రతినిధి, ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య: రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, పోలీస్ కమీషనర్లు మరింత అప్రమత్తంగా ఉండి ఏవిధమైన ప్రాణ నష్టం, ఆస్థి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ. గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావుతో కలసి గురువారం నాడు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ లో కలెక్టరెట్ లోని వీసీ హాల్ నుండి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడచిన మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో ఊహించిన దానికంటే ఎక్కువ మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని వీటిని దృష్టిలో పెట్టుకొని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గడచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసు కున్నారు. రాబోయే 24 గంటల్లో రెడ్ అలెర్టు ఉన్నమెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలలో తీసుకోవలసిన చర్య లపై కలెక్టర్లను అప్రమత్తం చేశారు. సహా యక చర్యలు పర్యవేక్షిం చేందుకు గాను ఉమ్మడి పది జిల్లాలకు సీని యర్ అధికారులను ప్ర త్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా లోలెవెల్ బ్రిడ్జిల దగ్గర పోలీసు సిబ్బందిని నియమించాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న వర్షాలు 200 మిల్లీమీటర్లకే బ్యాక్ వాటర్ వల్ల అక్కడున్న ప్రజలను తరలించవలసి వస్తుందని దీనికి శాశ్వత పరిష్కారం కోసం అక్కడున్న వారిని తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వీసీ లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీ వోలు, కలెక్టరెట్ ఏవో శ్రీకాంత్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.





## త్రివర్ణ పతాక రంగులతో ముస్తాబైన రామప్ప ఆలయం

ములుగు, సూర్యప్రతినిధి ఆగస్టు 14 (మేజర్ న్యూస్) : ములుగు జిల్లాలోని ప్రఖ్యాతి చెందిన రామప్ప ఆలయాన్ని త్రివర్ణ పతాక రంగులతో ముస్తాబు చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని దేవాదాయ శాఖ అధికారులు ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. త్రివర్ణ పతాక రంగులతో రామప్ప ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ జెండాలోని మూడు రంగుల వెలుగులతో రామప్ప ఆలయాన్ని దీపాలంకరణ చేయడంతో ఈ అద్భుత దృశ్యం సాకారమైంది.

## జాతీయ జెండాల పంపిణీ



చిట్యాల, ఆగస్ట్ 14 మేజర్ న్యూస్: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా గురువారం మండల కేంద్రంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్క భారతీయ పౌరుడు జాతీయ భావాన్ని కలిగి ఉండి భారతీయ సంస్కృతిని కాపాడుతూ దేశం కోసం పని చేయాలనే సంకల్పంతో మండల కేంద్రం లో జాతీయ జెండాలను పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు గుండ సురేష్, చెక్క నర్సయ్య, తీగల వంశీ, కేంసరపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ



చిట్యాల, ఆగస్ట 14 మేజర్ న్యూస్: మండలంలోని గోపాలపురం గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆదేశాల మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఇదిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, భూపాలపల్లి జిల్లా సేవదల్ అధ్యక్షులు ఏకు రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షులు నీలం కుమారస్వామి, పార్టీ సీనియర్ నాయకులు గన్నారపు సదయ్య, గోవిందుల భద్రయ్య, బత్తిని సదయ్య, గోవిందుల శంకరయ్య, చళ్ళ కుమార్, అంబాల రవి, గూడెపు చిన్ని, సంపెల్లి రాజు, చెవుల రమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వర్షాకాలం పంటల రక్షణే అధిక దిగుబడులకు మార్గం



### రైతులకు వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం నిపుణుల ప్రత్యేక సలహాలు

### పత్తి, వరి పంటల్లో వ్యాధులు, పురుగుల నివారణకు సూచనలు

రేగొండ, ఆగస్టు 14, మేజర్ న్యూస్ (సూర్య) : వర్షాకాలం పంటల రక్షణే అధిక దిగుబడులకు మార్గమని వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వీరన్న, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రమ్య తెలిపారు. గురువారం వారు స్థానిక మండల వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవరెడ్డితో కలిసి రేగొండ మండలంలోని పత్తి, వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులకు వర్షాకాలం పంటల సంరక్షణపై సూచనలు అందించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపాలని సూచించారు. అధిక వర్షాల ప్రభావంలో పత్తి పంట పెరుగుదల కోసం లీటర్ నీటికి 10 గ్రాముల పాలిఫీడ్ లేదా 13:0:45 మల్టీకే కలిపి పిచికారి చేయాలని చెప్పారు. వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మెరువట పోటాష్ను మొక్కలకు నాలుగు అంగుళాల దూరంలో వేయాలని వివరించారు. మొక్కలు గుంపులుగా ఎండిపోవడం లేదా వడలి పోవడం కనిపిస్తే వేరుకుళ్ల నివారణ కోసం లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ కలిపి మొక్క మొదల చుట్టూ పోయాలని సూచించారు. అధిక తేమ ఉన్నప్పుడు ఎకరాకు 10 కిలోల యూరియా, 400-500 గ్రాముల కార్బన్డజిం, మాన్కోజెబ్ కలిపి మొక్క మొదల దగ్గర వేయడం ద్వారా పార విల్ట్ సమస్యను నివారించవచ్చని తెలిపారు. తేమ కారణంగా వచ్చే ఆల్టర్నేరియా ఆకుమచ్చ, అసికోకైట బ్లైట్ వ్యాధుల నివారణకు మల్టీకేతో పాటు లీటర్ నీటికి 1.5 గ్రాముల క్యాప్తన్,హెక్సకోనజోల్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరి పంటలో నారు ముదిరిన తర్వాత కొనలు తుంచి నాటు వేయాలని, దీంతో కాండం తొలుచు పురుగు గుడ్లను నిర్మూలించవచ్చని తెలిపారు. నాటు వేసిన 20-25 రోజుల తర్వాత ఎకరాకు 8-10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి వేసి కాండం తొలుచు పురుగును నివారించాలని సూచించారు. రైతులు ఈ సూచనలు పాటిస్తే పంటలకు వ్యాధులు, పురుగుల ముప్పు లేకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

# జిల్లా విద్యా శాఖాధికారి పై చర్యలు తీసుకోవాలి




## ఆర్.జె.డి కి ఉపాధ్యాయ సంఘాల వినతి

వరంగల్ ఆగస్ట్14 మేజర్ న్యూస్(సూర్య)జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ పై చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్.జె.డి) కె.సత్యనారాయణరెడ్డి కి ఉపాధ్యాయ సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ డి.ఈ.ఓ మామిడి జ్ఞానేశ్వర్ అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఎ.ఎం.ఒ) పై కులం పేరుతో దుర్భాషలాడడం, 'తమాషా చేస్తున్నావా?'అని బెదిరింపులకు గురి చేయడం హేయమైన చర్య అన్నారు. జిల్లా విద్యాశాఖను ముందుండి నడిపించాల్సిన స్థాయిలో ఉండి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్న తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో కూడా 'రిజర్వేషన్లో ఉద్యోగం వచ్చింది కాబట్టి గ్రీన్ పెన్ను పట్టుకుంటే సరిపోతుందా?' అని ఎ.ఎం.ఒ సుజన్ తేజను అవమానపరిచేలా మాట్లాడడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంతే కాకుండా ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యల పట్ల నిర్లిప్త వైఖరి, ఉపాధ్యాయులను భయాందోళనలకు గురి చేసే విధంగా ప్రవర్తిస్తున్న తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు.ఇలా కుల నేపథ్యాన్ని కించపరిచే విధముగా, ఉపాధ్యాయులను అవమానపరిచేవిధంగా ప్రవర్తిస్తున్న డి.ఇ.ఓ జ్ఞానేశ్వర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్ జిహెచ్ఎంఎ, టీఎస్ యుటిఎఫ్,టిపిటిఎఫ్,డిటిఎఫ్,టి పియుఎస్, ఎస్సిఎస్టియుఎస్ సంఘాల రాష్ట్ర,జిల్లా నాయకులు ఎస్.రవీందర్, శ్రీనివాస రెడ్డి,భోగేశ్వర్,తాటికాయల కుమార్,సుజన్ ప్రసాదరావు, గోవిందరావు, వెంకటరమణ ,ఆచార్య ప్రద్యుమ్న,పరశురాములు,నర్సయ్య, ఎస్.ఎ.రవూఫ్, ఎస్.వెంకన్న,కె.రవీందర్, గుండు కరుణాకర్,నామోజు శ్రీనివాస్, వి.అరవింద్ కుమార్,కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



### బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు - చొక్కం శ్రీనివాస్

### గీసుగొండలో బైక్ ర్యాలీ నిర్వహించిన బీజేపీ శ్రేణులు

గీసుగొండ ఆగస్ట్ 14 మేజర్ న్యూస్ (సూర్య): 79 వ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని గీసుగొండ మండల పార్టీ అధ్యక్షులు చొక్కా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం భారతీయ జనతా పార్టీ జాతీయ రాష్ట్ర జిల్లా శాఖ ఆదేశాలకు మేరకు,వికసిత భారత్ నిర్మాణ రూప శిల్పి భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గీసుకొండ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో గీసుకొండ మెయిన్ రోడ్ నుండి మండల కేంద్రంలోని వివిధ కాలనీలలో జాతీయ జెండాలు చేతబట్టి భారత్ మాతా కీ జై, వందేమాతరం స్వతంత్ర భారత్ కి జై అంటూ నినాదాలు ఇస్తూ బైక్ ర్యాలీ నిర్వహించి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ముగించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చోక్కం శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 79 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన వాడ వాడలో ప్రతి ఇంటిపైన భారతీయుడు సగర్వంగా తమ ఇంటి పైన జాతీయ జెండా ఎగర వేసుకొని తమ యొక్క దేశ భక్తిని చాటుకోవాలని,స్వతంత్రం కొరకు తమ ప్రాణాలను అర్పించిన అమర వీరులను స్మరించుకుంటూ వారు త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఈ స్వతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ ముల్క ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నిమ్మగడ్డ జాన్విక్రమ్,జిల్లా అధికార ప్రతినిధి సల్ల సంబరాజు,బీజేవైఎం రాష్ట్ర మాజి కార్యవర్గ సభ్యులు ఆరకట్ల ప్రవీణ్,ఆకుల వెంకన్న, బీజేవైఎం అధ్యక్షులు ఆడువల అఖిల్,కత్తి వెంకన్న,ఎంబాడి రాజశేఖర్, కత్తి రమేష్, కందికొండా ప్రదీప్,గోపి, రాము,ముల్క సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ చొక్కాల

### గ్రామంలో వెంగళరావు పేట ఇంటింటి మలేరియా సర్వే

వెంకటాపురంనూగూరు ఆగస్టు 14 సూర్యా మేజర్ న్యూస్: ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ చొక్కాల గ్రామంలో వెంగళరావు పేట ఇంటింటి మలేరియా సర్వే నిర్వహించడం జరిగింది కూలర్లు. గోళాలు. డ్రమ్ములుతొట్లలో నిలువ నీరు పారబోయటం జరిగిందిగ్రామాల్లో జ్వరం ఉన్నవారికి రక్తపుత సేకరణ నిర్ధారణ కొరకు ఆర్డిటి పరీక్షలు చేయటం జరిగిందిఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పావులూరుగ్రామం మల్లాపురంలో ఈరోజు నిర్వహించడం జరిగింది జర పీడితులను గుర్తించి వారికి రక్త పూత సేకరణ ఆర్డిటి పరీక్షలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు అంగన్వాడి టీచర్ పాల్గొనడం జరిగింది.









## వాగులో కొట్టుకుపోయి గిరిజన మహిళ మృతి

### లక్ష్మీపురం గ్రామంలో విషాదం





వెంకటాపురం,నూగూరు ఆగస్టు 14 సూర్య మేజర్ న్యూస్ : ములుగు జిల్లావెంకటాపురం మండల పరిధిలో పాత్రపురం పంచాయతీ లక్ష్మీపురం గ్రామా నికి చెందిన ఇర్పా లక్ష్మి (48) గిరిజన మహిళ గ్రామ సమీపం లోని బండలవాగు దాటుతూ ప్రవాహం లో కొట్టుకుపోయిం ది. ఆమె కుమారుడు రమేష్ వాగు దాటి మోట్లగూడెం గ్రామానికి వెళ్లాడు. కొద్ది సేపటికి లక్ష్మి ఎవరి సహాయం లేకుండా వాగు దాటే ప్రయత్నంలో ప్రవాహంలో గల్లంతైంది. గురువారం గ్రామస్తులు వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం గ్రామస్తులు, పోలీసులు గాలింపు చేపట్టగా వాగు దాటుతున్న ప్రదేశానికి కిలోమీటర్ దూరంలో లక్ష్మి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై వెంకటాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆల్ ఇండియా బ్యాట్మెంటన్లో తృతీయ సాధించిన మనస్వీని



వర్ధన్నపేట ఆగస్టు 14 (మేజర్ న్యూస్ సూర్య): వర్ధన్నపేట పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్గా పని చేస్తున్న ఎస్ఐఐ చందర్ కుమార్తె మనస్వీని బ్యాట్మెంటన్ టోర్నమెంట్లో అత్యున్నత ప్రతిభ కనబరిచింది. ఈ నెల 9 నుండి 14 వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తలో జరిగిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ అండర్-13 విభాగంలో అత్యున్నత ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మనస్వీని ప్రతిభ పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.



# కల్లుగీత కార్మికుల హక్కులను సాధించుకుందాం

**కల్లు గీత కార్మికుల సమస్య లపై నిర్లక్ష్యం చేస్తే అసెంబ్లీని ముట్టడిస్తాం**

**అమరుల యాదిలో బైక్ ర్యాలీని నిర్వహించిన కల్లుగీత కార్మిక సంఘం నేతలు**

**ఏజెన్సీలో రద్దు చేసిన సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్**



గోవిందరావుపేట, ఆగస్టు 14 (మేజర్ న్యూస్ సూర్య): గీత కార్మికుల హక్కులను సాధించుకునే వరకు పోరాటం కొనసాగుతుందని గీత కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. గీత కార్మికుల అమరులను స్మరించుకుంటూ గురువారం మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెండా ఊపి కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటి నాయకులు బొనగాని సారయ్యగౌడ్, వత్సవాయి సారయ్య గౌడ్ లు ప్రారంభించారు. కల్లు గీత కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణమే పరిష్కారం చేయాలని, ఏజెన్సీ లో రద్దు చేసిన గీత సోసైటీ లను తక్షణమే పునరుద్దరణ చేయాలని డిమాండ్ చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో పోరాటాలు చేస్తామని తెలిపారు. కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అమరుల యాధిలో భాగంగా ఆగస్టు 2 నుండి 18 వరకు సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం గోవిందరావుపేట మండల కేంద్రంలో చల్వాయి గ్రామ కల్లు మండువ నుండి గోవిందరావుపేట పస్రా రాంపూర్ మొద్దులగూడెం తాళ్ళ మండువ వరకు భారీ ర్యాలీ చేస్తూ నినాదాలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఏజెన్సీ సొసైటీలపై ముఖ్యమంత్రి గత ప్రభుత్వంలో మాట్లాడిన మాటలను ఇప్పుడు నిజం చేయాలని రద్దయిన సొసైటీ పునరుద్ధరణ చేసి గీత కార్మికులకు సభ్యత్వం కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. అన్ని సొసైటీలకు చెట్ల పెంపకానికి భూమి కొనివ్వాలని, మెడికల్ బోర్డు విధానాన్ని సులభతరం చేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి ఎటువంటి షరతులు లేకుండా సైట్ ఓపెన్ చేసి వృత్తి పింఛన్ మంజూరు చేయాలని, ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అమరుల స్ఫూర్తితో కల్లుగీత కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా గీత కార్మికులకు పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రుద్రబోయిన మల్లేష్ గౌడ్, మద్దెల అయిలుమల్లు, గౌడ్ చెవుగాని అంజనేయులు గౌడ్, బండపెల్లి సాంబయ్య గౌడ్, వడ్లకొండ యాకయ్య గౌడ్, బాలగోని రవి గౌడ్, కాసగాని స్వామిగౌడ్, వేముల కృష్ణగౌడ్, మరికంటి సింహాబలుడు గౌడ్, గండు రాంబాబు గౌడ్, జక్కు భిక్షపతి గౌడ్, మేరుగు సత్యనారాయణ గౌడ్, పూజరి సారంగం గౌడ్, పెరుమాండ్ల రవి గౌడ్, కొన్నెచంద్రయ్యగౌడ్, ఎరుకల సారయ్య గౌడ్, గోపగాని రాజు గౌడ్, మద్దెల నాగరాజు గౌడ్, గుండేటి కుమారస్వామి, బుస్సాపూర్ సొసైటీ అధ్యక్షులు రాజుగౌడ్ తో పాటు 100 మంది కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.

# మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుకు ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు



**పుష్పగుచ్ఛం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి**

జేడీ మల్లంపల్లి, ఆగస్టు 14 (మేజర్ న్యూస్ సూర్య) : నర్సంపేటలో ఒక ప్రైవేటు హాస్పటల్ ఓపెనింగ్ చేసి తిరుగు ప్రయాణంలో మల్లంపల్లి వస్తున్న సందర్భంలో మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావుకు గురువారం బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ములుగు నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి బడే నాగజ్యోతి మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావుకు కి వివరించారు. అనంతరం హరీష్ రావు కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద నాయక్, మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, వేములపల్లి బిక్షపతి, మాజీ సర్పంచ్ చంద కుమారస్వామి, మద్దెనవేయిన రాములు, యాకూబ్, మాజీ ఎంపీటీసీ విష్ణు, మాచర్ల ప్రభాకర్, జన్ను శ్రీనివాస్, సీనియర్ నాయకులు బతోజు ద్రోణాచార్య, భూక్య జంపన్న, సంతోష్, చోటేమియా, ఇటుకల నరహరి, చితి రెడ్డి మల్లారెడ్డి, చితి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భూక్య దేవేందర్, పోరిక విజయరామ్ నాయక్, ఆకుతోట చంద్రమౌళి, ఈసం రామ్మూర్తి, మాదరి రామయ్య, గడ్డమీది భాస్కర్, ఇరుప విజయ, చెన్న విజయ్, ఇరుప విజయ, కొడారి మహేందర్, గ్రామాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా శ్రీను



చిట్యాల, ఆగస్టు 14 మేజర్ న్యూస్: మండలం జడల్ పేట గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ కార్యకర్త సుధగాని శ్రీను ను బిజెపి జిల్లా కార్యదర్శిగా గురువారం నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సుదగాని శ్రీను మాట్లాడుతూ బిజెపి జిల్లా కార్యవర్గంలో జిల్లా కార్యదర్శిగా నియామకానికి సహకరించిన బిజెపి నియోజకవర్గ ఇన్ చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏడునూతల నిశిధర్ రెడ్డి, మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్కూల్ విద్యార్థులకు వైఫై అందజేత



కన్నాయిగూడెం, ఆగస్టు 14(మేజర్ న్యూస్ సూర్య): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం ప్రాథమిక పాఠశాల యందు డిజిటల్ తరగతులకు విద్యార్థులకి ఇబ్బంది అవుతుంది అని స్కూల్ ఉపాధ్యాయులు కోరగా వెంటనే తెలుసుకున్న కన్నాయిగూడెం కాంగ్రెస్ మండలం ఇంచార్జి జాడి రాంబాబు తన సొంత ఖర్చులతో స్కూల్ కోసం మన విద్యార్థుల కోసం మన పిల్లల బంగారు భవిష్యత్తు కోసం అని గ్రామస్థులతో కలిసి స్కూల్ ఉపాధ్యాయ యాజమాన్యానికి వైఫై అందజేశారు.ఈ సందర్భంగా జాడి రాంబాబు మాట్లాడుతూ మన స్కూల్ కోసం మన విద్యార్థుల కోసం ఇంకా ఎటువంటి సమస్యలు ఉన్న నా వంతు తోచిన సహాయం చేయానికి సిద్ధం అని అన్నారు. అలాగే ఇంకా ఎటువంటి అవసరాలకు అయినా రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దాతలుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వివిధ గ్రామ సిబ్బంది,పత్రికా విలేకరులు,గ్రామ యువత,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముస్తాబైన ములుగు కలెక్టరేట్



ములుగు, సూర్య ప్రతినిధి ఆగస్టు 14 (మేజర్ న్యూస్): 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయాన్ని గురువారం రాత్రి అందంగా ముస్తాబు చేశారు. త్రివర్ణ పతాక రంగులతో కూడిన దీపకాంతులను కలెక్టరేట్ కార్యాలయం చుట్టూ అలంకరించారు. అంతేకాకుండా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు తంగేడు మైదానంలో జరగనున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.







# బుగులోని జాతర పనులు వేగవంతం

## రెండు నెలల్లో పూర్తి చేయాలన్న ఎమ్మెల్యే ఆదేశాలు

## జాతర ప్రాంగణాన్ని పరిశీలించిన అధికారులు

రేగొండ, ఆగస్టు 14, మేజర్ న్యూస్ (సూర్య) : మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో వెలసిన శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణ పనులు వేగవంతం కానున్నాయి. బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ స్వయంగా పరిశీలించి, వచ్చే రెండు నెలల్లోనే పనులు పూర్తి కావాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, పీఆర్, ఫారెస్ట్ శాఖల ఉన్నతాధికారులు జాతర గుట్టకు చేరుకొని ప్రాంగణం, మార్గాలు, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. తక్షణమే టెండర్లు, పనుల అమలు, ఫీల్ మానిటరింగ్ ప్రారంభించేందుకు నిర్ణయించా రు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈలు రవికుమార్, సతీష్, పీఆర్ ఏఈలు తిరుపతి, అరవింద్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శ్వేత, ఏఈ సౌజన్య, ఫారెస్ట్ డివిజన్ అధికారి అప్పలకొండ, రేంజ్ ఆఫీసర్ నరేష్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ గౌతమి, బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, జాతర కమిటీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి, మాజీ చైర్మన్ కట్ల మధుసూదన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, నాయకులు గంగుల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## సీనియర్ జర్నలిస్ట్ సమ్మయ్య కుటుంబానికి 70 వేల ఆర్థిక సహాయం

తాడ్వాయి ఆగస్టు14మేజర్ న్యూస్ సూర్య : మండలంలోని కాటాపూర్ గ్రామంలో మృతి చెందిన సీనియర్ రిపోర్టర్ నవ తెలంగాణ తాడ్వాయి మండలం విలేఖరి తమ్మల సమ్మయ్య కుటుంబ సభ్యులకు ములుగు జిల్లా జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు ఐజేయు జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షఫీ, ఉపాధ్యక్షులు బెత్ సతీష్ కుమార్ యాదవ్ ,ప్రధాన కార్యదర్శి సిదురాల వాసుదేవ్,70 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకు న్నారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్ట్ నాయకులు మాట్లాడుతూ సమ్మయ్య పత్రికా రంగానికి చేసిన సేవలు మరువలేని అని అన్నారు.ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు,ఏటూర్ నాగారం, తాడువాయి, గోవిందరావుపేట ,తదితర మండలాల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు. జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అంకం వినయ్ కుమార్, రఘువీర్,మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,కోట రమేష్, బండారి లక్ష్మయ్య, కోకిల సారయ్య చింతల సంపత్ యాదవ్ ,దేవేందర్ యాదవ్,పురుషోత్తం,గంపల శివకుమార్,బట్టు గోపి ,సాయిని శ్రీనివాస్, లక్ష్మణ్, పుల్లూరి రాజు ,మాట్ల సంపత్, రమేష్ ,తదితరులు పాల్గొన్నారు.

## జాతర రహదారి పై కుంగిన వంతెనను పరిశీలించిన టీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బడే నాగజ్యోతి



జేడీ మల్లంపల్లి, ఆగస్టు 14 (మేజర్ న్యూస్ సూర్య): మల్లంపల్లి వద్ద కుంగిన వంతెనను మల్లంపల్లి మండల నాయకులతో కలిసి గురువారం ములుగు నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ నియోజవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారులు పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ ఇష్ట రాజ్యంగా పనులు చేపట్టడంతో ముందస్తు చర్యలు చేపట్టకుండా రహదారి పనులు చేపట్టడంతో కొద్దిపాటి వర్షాలకే కెనాల్ వంతెన కుంగిపోవడంతో వాహన రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజల నిత్యవసరాలుకి చాలా ఇబ్బందిగా మారడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించి పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, తత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారిని పకడ్బందీగా ఏర్పాటు చేసి ప్రజలకు ఏర్పడిన ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లంపల్లి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ ను

# విజయవంతం చేయండి



**మహబూబాబాద్ ఆగస్టు 14 మేజర్ న్యూస్ (సూర్య)**
మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కురవి గేట్ సెంటర్లో ఈనెల 16వ తేదీన ప్రతిష్టాపించనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు జేరిపోతుల వెంకన్న గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పంజాల ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామం నుండి,ప్రతి ఇంటి నుండి ఒకరు తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు. గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఫాతిమా స్కూల్ నుండి విగ్రహ ప్రతిష్టాపన సెంటర్ కురవి గేట్ వరకు 2000 మందితో బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టి పి సి సి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మగాని మహేష్ కుమార్ గౌడ్,మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ప్రధాన కార్యదర్శి ముత్య వెంకన్న గౌడ్, కోశాధికారి బిక్కి వెంకటేశ్వర్లు, ప్రచార కమిటీ కన్వీనర్ చిత్తూరు శ్రీనివాస్, కమిటీ బాధ్యులు,పాల్గొన్నారు.

## వితంతువులకు ఇందిరమ్మ ఇండ్లు

# మంజూరు చేయాలి

**కేసముద్రం,ఆగస్టు 14:**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్లో సిపిఎం పార్టీ మున్సిపల్ శాఖ కార్యదర్శి జల్లే జయరాజు ,సీనియర్ నాయకులు చాగంటి కిషన్ పర్యటించిన అనంతరం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది , కాని అర్హులైన వితంతు వులకు,వికలాంగులకు ,నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు రాలేదని అన్నారు. ఎన్టీఆర్ నగర్లో దాసరి స్వరూప అనే వితంతువుకు ఉన్న పెంకుటిల్లు మొత్తం వర్షాలకు కూలిపోయిన సందర్భంలో వేరే చోట అద్దెకు ఉంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా నిరుపేదలకు ఇంటి నెంబర్లు లేక చాలామందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాలేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపాలిటీ అధికారులు స్పందించి అర్హులైన వారందరికీ ఇంటి నెంబర్లు ఇవ్వాలని, వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమైనది. ఇంటికి పిల్లర్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతితో ఆమోదింపజేయాలి

**కేసముద్రం,ఆగస్టు 14:**
కేసముద్రం మండల కేంద్రంలో గురువారం సిపిఎం మండల కమిటీ సమావేశం చాగంటి కిషన్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆకుల రాజు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం అసెంబ్లీ తీర్మానం చేసింది, తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి 8 మంది ఎంపీలు గెలిచారు,ఇద్దరు కేంద్ర మంత్రులు అయ్యారు, బీసీ ని ముఖ్యమంత్రి చేస్తానని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన బిజెపికి,బీసీ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే,బీసీ రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి తో ఆమోదింప చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు నిర్వహిస్తుంద ని, రాబోయే రోజుల్లో పోరాటాలు ఉద్ధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు, మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, మండల కమిటీ సభ్యులు బొబ్బల యాకుబ్ రెడ్డి, కావటి నర్సయ్య, జల్లే జయరాజు,మోడెం వెంకటేశ్వర్లు, నీరుటి జలంధర్, తాడబోయిన శ్రీశైలం, అల్లుగొండ సావిత్ర, జాటోత్ వెంకన్న,సోమారపు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## 108 పేద ప్రజలకు గుండెకాయ లాంటిది

**కమలాపూర్ ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య :-**



108 కి ఫోన్ వచ్చిన వెంటనే సిబ్బంది ఆలస్యం చేయకుండా సంఘటన స్థలానికి చేరుకోని ప్రథమ చికిత్స అందించాలని 108 సిబ్బందికి హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య సూచించారు. 108 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం కమలాపూర్ 108 అంబులెన్స్ వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్ లోని అన్ని పరికరాలను పరిశీలించారు. సక్షన్ ఆపరేటర్,పల్స్ ఆక్సి మిటర్,గ్లుకోమిటర్,మానిటర్ వర్కింగ్ కండిషన్ లో ఉండాలని ఆక్సిజన్ నిలువలు పూర్తిస్థాయిలో ఉండేలా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని 108 అంబులెన్స్ పేద ప్రజలకు గుండెకాయ లాంటిదని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా మేనేజర్ మండ శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ విప్లవ కుమార్, 108 సిబ్బంది ఈఎంటి బండ ఉపేందర్, పైలెట్ చెలికే తిరుపతి తదితరులు ఉన్నారు.

## వైద్య శిబిరం ఏర్పాటు



**పాలకుర్తి ఆగస్ట్ 14 మేజర్ న్యూస్ (సూర్య)**
పాలకుర్తి మండలం శాతాపురం గ్రామంలో మండల వైద్యాధికారి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన యం యల్ పి మౌనిక, ఎంపీహెచ్ఎన్ ఎన్ సునంద, సూపర్ వైజర్ ఇంద్రాణి, ఈ సందర్భంగా గ్రామములో రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు కంజర్ల మంజుల పసులాది సుమలత, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యకి మృతి

**దేవరుప్పుల ఆగస్టు 14 మేజర్ న్యూస్ (సూర్య):**



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన పాలకుర్తి మండలంలోని వావిలాల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన జోగు భీమయ్య (57) వావిలాల గ్రామానికి చెందిన తన బావమరిది అనపర్తి వెంకటయ్య ఇంటికి చుట్టం చూపుగా వెళ్లగా వారి ఇంటి దగ్గర ప్రమాదవశాత్తు సర్వీస్ వైరు తెగి భీమయ్య మీద పడడంతో కరెంట్ షాక్ తగిలింది వెంటనే చికిత్స నిమిత్తం పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి మార్గమధ్యలోనే మరణించాడని తెలిపారు. మృతుడి భార్య ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాలకుర్తి పోలీసులు తెలిపారు.

# సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి....

## సైబర్ వారియర్లకు టీ షర్ట్ లను అందజేసిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్...



**మహబూబాబాద్ ఆగస్టు 14 మేజర్ న్యూస్ (సూర్య)**

మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్ లలోని సైబర్ వారియర్ లకు టీ షర్ట్ లు అందజేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ నుండి టీ షర్ట్ లను జిల్లా కేంద్రలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ మాట్లాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థలో ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఒక ప్రత్యేక సైబర్ వారియర్ ను నియమించి, ఆయా పరిధిలో జరుగుతున్న సైబర్ నేరాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. సైబర్ వారియర్స్ తమ స్టేషన్ పరిధిలో వచ్చిన ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలించి, సాక్ష్యాలను సేకరించి, వాటిని జిల్లా సైబర్ సెక్యూరిటీ విభాగానికి డైరెక్ట్ చేసే బాధ్యతలు నిర్వర్తిస్తారని తెలిపారు.ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఈకామర్స్, ఫోన్ కాల్స్ ద్వారా జరుగుతున్న మోసాలను నివారించేందుకు ప్రజలలో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని, సైబర్ వారియర్స్ ఫిర్యాదులు వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి, నిందితులను గుర్తించి చర్యలు చేపట్టాలని, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన తాజా పద్ధతులు, సాంకేతికతలను నిరంతరం నేర్చుకుంటూ ప్రజల రక్షణకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సైబర్ క్రైమ్ డిఎస్పీ కె.శ్రీనివాస్, ఎస్ఐ బి. కరుణాకర్, పోలీసు స్టేషన్ ల సైబర్ వారియర్లు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందించడంలో ప్రజా ప్రభుత్వం విఫలం

**ఇనుగుర్తి, ఆగస్టు 14, మేజర్ న్యూస్ (సూర్య):**

రైతులకు సమయానికి సరిపడా యూరియా అందించడంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం విఫలమైందని ఇనుగుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద గురువారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు యూరియా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గత పది రోజులుగా యూరియా కొరత ఉండడంతో రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియాకు కృత్రిమ కొరత ఏర్పడిందని రైతులు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడ యూరియాను అందుబాటులో ఉంచి ఇబ్బందులను తీర్చాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ



**పాలకుర్తి ఆగస్ట్ 14 మేజర్ న్యూస్ (సూర్య)**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ జిల్లా పార్టీ పిలుపుమేరకు పాలకుర్తి మండల కేంద్రంలో మండల అధ్యక్షులు మారం రవి కుమార్ ఆధ్వర్యంలో"హర్ ఘర్ తిరంగా" బైక్ ర్యాలీ పాలకుర్తి శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయం నుండి రాజీవ్ చౌరస్తా మీదిగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని మండల కేంద్రంలో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడం, చైతన్య పరచడం కోసం హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిపై జెండా ఎగరవేయాలని,ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయేలా హర్ ఘర్ తిరంగ్ ఉండాలన్నారు.ఆపరేషన్ సింధూర్ తో శత్రు దేశాలతోని భారతదేశాన్ని కాపాడడంలో ముందున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కదుదుల నిరంజన్ రెడ్డి,ప్రోగామ్ జిల్లా కో - కన్వీనర్ దుంపల సంపత్,జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ రాంరావు, మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజు, పట్టణ అధ్యక్షులు పబ్బా సంతోష్,బీజేవైఎం జిల్లా నాయకులు పూజారి మహేష్,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మామిండ్ల వెంకన్న,గిరిజన మోర్చ మండల్ అధ్యక్షుడు లకావత్ రవి,మచ్చ సునీల్, అశోక్,సతీష్,ఉపేంద్ర చారీ,గణేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నంగా ఆత్మకూరు కెనరా బ్యాంక్ సేవలు




**ఆత్మకూరు ఆగస్ట్ 14, మేజర్ న్యూస్ (సూర్య):**

ఆత్మకూరు కెనరా బ్యాంక్ సేవలు అధ్వాన్నంగా తయారయ్యాయని పలువురు బ్యాంకు ఖాతాదారులు వాపోతున్నారు. బ్యాంక్ సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తూ ఖాతాదారులకు సేవలు అందించడంలో చుక్కలు చూపిస్తున్నారని ఖాతాదారులు మండిపడుతున్నారు . ఖాతా దారులు బ్యాంకు లావాదేవీల కోసం వస్తే రోజంతా పడి గాపులు కాయాల్సి వస్తుందని పని అయితదో కాదో నమ్మకం లేకుండా పోతోందని వివిధ గ్రామాల ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. బ్యాంక్ బ్రాంచ్ పత్రిక మిత్రుల అందరి కృషి ఫలితంగానే బ్రాంచ్ వచ్చిందని సంగతి బ్యాంకు యాజమాన్యం మరచిపోయి నారని కొందరు వినియోగదారులు అంటున్నారు. ఆత్మకూరు కెనరా బ్యాంక్ ఆత్మకూరు మండలం తో పాటు ఇతర మండలాల్లోని గ్రామా లు బ్యాంకు దత్తత తీసుకుంది. దీంతో బ్యాంకుకు రోజు పెద్ద మొత్తంలో ఖాతాదారులు లబ్ధిదారులు వస్తుంటారు. కానీ వారికి సేవలందించడంలో మాత్రం వెనుకబడి పోతుందని ఆరోపణలు వస్తున్నాయి. బ్యాంకులో చెల్లింపులు రెన్యువల్స్ విత్డ్రా లు జరగాలంటే రోజంతా క్యూ లైన్ లో నిలబడాల్సి న దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు పని కోసం సిబ్బంది వద్దకు వెళ్తే ఈ పనినాది కాదు అంటూ సిబ్బంది ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఖాతాదారులను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడుతున్నారు. రోజంతా సిబ్బంది సెల్ ఫోన్ లోనే గడుపుతూ ఖాతాదారుల పట్ల నిర్లక్ష్య ధోరణి తో వ్యవహరిస్తున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల నుండి వచ్చే ఖాతాదారులను ఈసడించుకుంటూ లోకువ చేసి మాట్లాడుతున్నారని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోన్స్ రెన్యువల్స్ కోసం వచ్చిన ఖాతాదారులను ఇప్పుడు రా అప్పుడు రా అంటూ రోజుల తరబడి తిప్పు కుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి .ఇదేమిటని ప్రశ్నిస్తే ఇబ్బందులు ఉంటాయి అంటూ దురుసుగా సమాధానం వస్తుందని బహాటంగా ఆరోపిస్తున్నారు. ఖాతాదారులకు సేవలందించేందుకు సరైన సరిపడ సిబ్బందిని నియమించాల్సి ఉందని ఖాతాదారులు అంటున్నారు. కాగా బ్యాంకు మండల కేంద్రంలో ఉన్నప్పటికీ ఊరు చివరగా ఉండటంతో మహిళలు, వృద్ధులు వికలాంగులు, ప్రయాస కోర్చి బ్యాంకుకు నడిచి వెళ్లినప్పుడు వెళ్లిన పని కాకపోతే మా రోదన వర్ణాతీతంగా ఉందని ఓ ఖాతాదారుడు ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా బ్యాంకు ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి ఊరి మధ్యలో ఒక మినీ బ్యాంకు ను ఏర్పాటు చేసి కెనరా బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, బ్యాంకు పనితీరు మెరుగుపరిచి ఖాతాదారులకు సేవలు అందించాల్సిందిగా కోరుతున్నారు.

# ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ గుర్తు తెలియని వ్యక్తులు

**ఇనుగుర్తి, ఆగస్ట్ 14, మేజర్ న్యూస్ (సూర్య):**



ఇనుగుర్తి మండల కేంద్రంలో వల్లంల శాంతమ్మ అనే వృద్ధురాలు మరియు వల్లంల రాములు అనే ఇరువురి బాధితుల ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు.ఈ విషయం తెలుసుకున్న కేసముద్రం ఎస్సై కర్నాకర్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితుల ఇండ్లను పరిశీలించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం శాంతమ్మ అనే వృద్ధురాలు బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని తన కూతురి ఇంటికి వెళ్లడంతో ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లో చొరబడి బలమైన ఇనుప రాడ్లతో బీరువా తాళాలను పగలగొట్టి 15 గ్రాముల బంగారం దొంగిలించినట్లు తెలిపారు. అంతేగాక వల్లంల రాములు ఇంట్లో 20 తులాల వెండి కడియాలు,3 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు.తమ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తులను గుర్తించి దొంగలించిన ఆభరణాలను తిరిగి ఇప్పించి తమకు తగిన న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

# జాతీయ పథకం 200 మీటర్లు

**జనగామ జిల్లా. సూర్య ప్రతినిధి ఆగస్టు 14 మేజర్ న్యూస్):-**



భారతీయ జనతా పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు సౌద రమేష్ ఆధ్వర్యంలోజనగామ జిల్లా కేంద్రంలోని స్థానిక నెహ్రూ పార్క్ నుండి బస్టాండ్ చౌరస్తా వరకు భారీ 200 మీటర్ల జాతీయ పథకాన్ని హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సౌద రమేష్ మాట్లాడుతూ ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని భారీ ఎత్తున గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించడం జరిగిందని దేశంలోని ప్రతి పౌరునిలో దేశభక్తి నింపాలని భారతీయులంతా కులాలకు ,మతాలకు అతీతంగా మనమంతా ఒక్కటే అని ప్రపంచానికి చాటి చెప్పాలని మొన్న జరిగిన పహల్గామ్ దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టిన దేశ భద్రత దళాల పోరాటపటిమను కొనియాడారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీలన్ రెడ్డి ,తిరంగా యాత్ర కన్వీనర్ శశిధర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్, కౌన్సిలర్ హరిచంద్ర గుప్తా, దండ్యాల లక్ష్మారెడ్డి జనగామ పట్టణ బిజెపి అధ్యక్షులు అనిల్, పెద్దోజు జగదీష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి,బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్,బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహిపాల్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు నవీన్ కుమార్, సతీష్, నవీన్ రెడ్డి ,శివ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు మండలాలకు ఉపయోగపడేలా 33 కెవి లైన్

**కొత్తగూడ ఆగస్టు 14 (మేజర్ న్యూస్ (సూర్య)**




కొత్తగూడ గంగారం ఉమ్మడి రెండు మండలాలకు కరెంట్ ఇబ్బందులు తొలిగించేలా 33 కెవి విద్యుత్ లైన్ ను అందుబాటులో తేవడం జరిగిందని సి,ఇ రాజు చౌహన్ అన్నారు. గురువారం రోజున మండలం లోని సాదిరెడ్డిపల్లి లో 33 కెవి విద్యుత్ ను స్థానిక సబ్ స్టేషన్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మంగళవారి పేట పీడర్ నుండి అదనంగా 33 కెవి విద్యుత్ లైన్ అందుబాటులో కి రావడంతో ఏజెన్సీ మండలలకు విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని అన్నారు. 33 కెవి విద్యుత్ లైన్ ద్వారా కొత్తగూడ గంగారం మండలలకు ఎంతో ఉపయోగకరం అని అన్నారు. ఆయన వెంట ఎస్ ఇ విజేందర్ రెడ్డి,డి ఇ ఆపరేషన్ విజయ్, డి ఇ కన్స్ట్రక్షన్ సునీత, హార్జీ,ఏడిఇ ఆపరేషన్ కవిత, ఐలయ్య,ఏఇ ఆపరేషన్ సురేష్,ఏఇ కన్స్ట్రక్షన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి పై కేసు నమోదు.

**కొత్తగూడ, ఆగస్టు 14 (మేజర్ న్యూస్ (సూర్య)**

అడవి పందిని వేటాడి మాంసాన్ని అమ్ముతున్న ఓటాయి గ్రామానికి చెందిన బాణోతు శ్రీకాంత్ అనే వ్యక్తిని అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకుని, అతనిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు కొత్తగూడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వజహత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొత్తగూడ రేంజ్ ఫారెస్ట్ అధికారులు మండల కేంద్రంలో మాంసాన్ని అమ్ముతున్న బానోత్ శ్రీకాంత్ ను రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఈ వ్యక్తిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి మహబూబాబాద్ జిల్లా కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించడం జరిగింది.

## అకాల వర్షాలతో రైతాంగానికి

# అపార నష్టం

**దెబ్బతింటున్న పత్తి పంటలు**


**పత్తి చేలలో రాలుతున్న పూత**

**నడి కూడ ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య**

గత వారం రోజుల నుండి నడికుడ మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు అపార నష్టాలకు గురి అవుతున్నారు. ప్రతిరోజు వర్షం పడడంతో పత్తి చేనులలో వర్షపు నీరు నిలిచి పత్తి చెట్లు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో రైతులు మిరప విత్తనాలు మల్లు తయారు చేసుకొని నాట్ ఎందుకు అనుకూలంగా విత్తనాలను మడులలో నాటుకున్నారు. వర్షం తీవ్రంగా ఉండడంతో మిరుపనాలు తెగుళ్ల వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడేందుకు ఎరువులు పురుగు మందుల వ్యాపారులు చెప్పిన విధంగా మందులను పిచికారి చేస్తున్నామని తెలిపారు. వర్షాలతో ముందుగా పత్తి విత్తనాలు నాటుకున్న రైతులలో కొందరి పత్తి చేలు పూత దశలో ఉన్నాయని వర్షాల మూలంగా రాలుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

### వర్షాలలోతో పనులు లేక మహిళ వ్యవసాయ కూలీలు

ఖరీఫ్ సీజన్లో ప్రస్తుత సమయంలో పత్తి చేనులలో గడ్డి విపరీతంగా పెరగడంతో రైతులు వ్యవసాయ మహిళా కూలీలతో పత్తిలో కలుపు నివారణ చర్యలు చేపడతారు. అయితే కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా రైతులు ఎవరు వ్యవసాయ కూలీలను పనులకు పిలువకపోవడంతో కుటుంబాలు భారంగా మారాయని వ్యవసాయ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతాంగని మాత్రం అపార నష్టం చేయు చూడవలసిన పరిస్థితి నెలకొంది.



# హర్ ఘర్ తిరంగా ర్యాలీ





**తరిగొప్పుల ఆగస్టు 14 మేజర్ న్యూస్ సూర్య**

రాష్ట్ర మరియు జిల్లా పార్టీ పిలుపుమేరకు భారతీయ జనతా పార్టీ తరిగొప్పుల మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్, యువమోర్చా మండల అధ్యక్షులు చిలువేరు వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం తరిగొప్పుల మండల కేంద్రంలో బైక్ ర్యాలీ ని నిర్వహించారు వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందే విధంగా ర్యాలీలో స్వాతంత్ర అమరవీలను కొనియాడుతూ నినాదాలు చేశారు మండల అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ మన జాతీయ పతాకం ప్రతి ఒక్కరి ఇంటిపై ఎగరవేయాలని దేశం పట్ల ప్రజలు ముఖ్యంగా యువత ఎల్లప్పుడూ ప్రేమను చాటాలని మేము సైతం అంటూ దేశ సేవలో ముందు వరుసలో ఉండాలని 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. భారతదేశం ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా ఎదగడం భారతీయులకు ఎంతో గర్వకారణం అని అన్నారు శత్రు దేశాలకు వణుకు పుట్టే విధంగా భారత సైన్యం శక్తివంతమైంది అన్నారు దీనికి నిదర్శనం మొన్న జరిగిన ఆపరేషన్ సింధూర్ విజయం అన్నారు ఈ కార్యక్రమంలో తిరంగా ర్యాలీ ప్రోగ్రాం కన్వీనర్ ఎడెల్లి రామ్ నర్సింహారెడ్డి,గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మూడవత్ రాజు నాయక్, బూత్ అధ్యక్షులు బెల్లం రమేష్ ,సుధాకర్, ప్రవీణ్ నాయక్, రాజశేఖర్ చారి ముప్పిడి రమేష్ సాంబరాజు బాలయ్య సాగర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి జిల్లాప్రధాన కార్యదర్శిగామదన్ నాయక్

**నెల్లికుదురు ఆగస్టు14 మేజర్ న్యూస్ (సూర్య)**

భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోనిరత్తిరాంతండామాజీఎంపీటీసీ మదన్ నాయక్ ను నియమించారు. గురువారం చరవాణిలోమదన్ నాయక్ మాట్లాడుతూ జిల్లాప్రధానకార్యదర్శిపదవిని బాధ్యతగా తీసుకొని భారతీయజనతాపార్టీ విజయంకోసం రానున్నరోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా సైనికుడిలా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని,అదేవిధంగా భారతీయ జనతా పార్టీలో యువకులకు ప్రాధాన్యత ఉంది అనడానికి నేనే ఒక నిదర్శనమని గతంలో ఉమ్మడి వరంగల్ BJYM ప్రధాన కార్యదర్శిగా, 2019 స్థానిక ఎన్నికల్లో నెల్లికుదురు ZPTC జనరల్ స్థానంలో ZPTC అభ్యర్థిగా,MPTC గా పోటీ చేసే అవకాశం నాడు భారతీయ జనతా పార్టీ ఇచ్చిందని,ఎంపీటీసీగా విజయంసాధించిన తర్వాత BJYM తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతలలో నియమించి ప్రోత్సహించిందని పార్టీకి ప్రజలకుమధ్యవారధిగాఉండిప్రజాసమస్యల పరిష్కారానికై తప్పకుండా కృషి చేస్తానని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమకానికి సహకరించినటువంటి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు,నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్, జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు,మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, ఒద్దిరాజు రామచంద్ర రావు, మాజీ ఎంపీ సీతారాంనాయక్,చీకటిమహేష్,చెల్పూరి వెంకన్న, సింగారపుసతీష్, బిజెపినాయకులకు కార్యకర్తలకుప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూరు ఆగస్టు 14, మేజర్ న్యూస్ (సూర్య):** గురువారం ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో ఎస్ డి ఎఫ్ నిధుల నుండి రూ 20 లక్ష్యలతో చేపట్టిన మహిళా కమ్యూనిటీ హాల్ ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ...రాబోయే రోజుల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.గతంలో మహిళలు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే వారని, నేడు విభిన్న రంగాల్లో రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారన్నారు. పరకాల నియోజకవర్గంలోని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, మహిళా డైరీ ను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.32 కోట్ల రూపాయలతో మహిళా భాగస్వామ్యంతో మహిళా డైరీ ఏర్పాటు చేయబోతున్నామని, మహిళలు తన సొంత కాళ్లపై నిలబడేలా ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు.అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు.పిసిసి అధ్యక్షులుగా ఉన్న సమయంలో మాట ఇచ్చిన ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కంపేట గ్రామాన్ని రెవెన్యూ విలేజ్ గా మార్చారని, అలాగే డిజిటల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, గ్రామానికి హెల్త్ సెంటర్ మంజూరైనదని, రూ 50 లక్షల రూపాయలతో సీతారామస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు,నివాస గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఉచిత బస్ ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సు కొనుగోలు,తదితర సంక్షేమ పథకాలనూ అమలు చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వెంట స్థానిక తహసిల్దారు ఎన్.జగన్ మోహన్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాసరెడ్డి ఉన్నారు. అనంతరం మహిళలు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి పూల భోకెతో శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు . నాయకులు ప్రజా ప్రతినిధులు కూడా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి ని శాలువాతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కమలాపురం రమేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బీరం సునంద సుధాకర్ రెడ్డి, అగ్రంపాడు సమ్మక్క సారక్క జాతర చైర్మన్ శీలం రమేష్, మండల సమన్వయకర్తలు ముద్ధం సాంబయ్య, మాజీ జడ్పిటిసిలు కక్కెర్ల రాధిక రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కంచ రవికుమార్, ఎలకతల హంసాల్, ఆయా గ్రామ పార్టీల అధ్యక్ష కార్యదర్శులు మహిళలు కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీ,మాజీ ఎమ్మెల్యే





**కేసముద్రం, ఆగస్టు 14:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్ పెదనాన్న కుమారుడు కమటం రవీందర్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న మహబూబాబాద్ నియోజకవర్గ మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ లు గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మృతుడు రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నీలం దుర్గేష్,బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్,టౌన్ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు జాటోత్ హరీష్ నాయక్, మాజీ ఎంపీటీసీ సట్ల వెంకన్న తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠిన చర్యలు



**కేసముద్రం,ఆగస్టు 14:** కేసముద్రం మండలం లోని పలు ఎరువుల దుకాణాలలోని యూరియా నిల్వలను గురువారం సహాయ వ్యవసాయ సంచాలకులు మహబూబాబాద్ డివిజన్ అజ్మీరా శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బి. వెంకన్న తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఆయా షాపులలో స్టాక్ రిజిస్టర్, బ్యాలెన్స్, పి ఓ ఎస్ మిషన్ బాలన్స్, గోదాం బ్యాలెన్స్, స్టాక్ బోర్డు వివరాలు ఇన్వైస్లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏ డి ఏ మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఎవరైనా యూరియా ను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అధిక ధరలకు విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు పిఓఎస్ మిషను,ఆధార్ కార్డు, పట్టాదారు పాసు బుక్ జిరాక్సు ద్వారా మాత్రమే యూరియాను, ఇతర ఎరువులను సప్లై చేయాలని తెలిపారు. నియమ నిబంధనలు అతిక్రమించిన ఎరువుల డీలర్ల పై నిత్యావసర వస్తువుల చట్టం 1955, ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ప్రతిరోజు స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు,ఇన్వైస్లు,స్టాక్ బోర్డులు అప్డేట్ చేయాలని వారు సూచించారు.నానో యూరియా మీద రైతులకు అవగాహన కలిగిచినారు, పైపాటు గా పిచికారి చేసి వివిధ పంటలలో మంచి పంట దిగుబడులను పొందాలని సూచించారు.దఫా ల వారిగా యూరియా వస్తున్నందున రైతులు ఎవరూ అధైర్య పడొద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండాలి

**పెద్దవంగర, ఆగస్టు 14, (సూర్య న్యూస్)**

ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాను కలిగి ఉండాలని ఏపిఎం మహమ్మద్ పాషా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక నందు ఎస్బిఐ బ్యాంకు ఆధ్వర్యంలో జన సురక్ష క్యాంపు నిర్వహించడం జరిగింది. బ్యాంకు ఖాతా లేనివారికి జన సురక్ష ఖాతాను క్యాంపులో భాగంగా అక్కడికక్కడే ఓపెన్ చేస్తామని, అదేవిధంగా 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాలు లోపు ఉన్నవాళ్లు సంవత్సరానికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 20 రూపాయలు మరియు 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలు లోపు ఉన్నవారికి 436 రూపాయలు కట్టుకోవాలని సూచించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం, ఎన్పీఎస్ వాత్సల్య పథకం వంటి ఎన్నో పథకాలు ఉన్నాయని వాటన్నింటిని వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లికుదురు సిఎఫ్ ఎల్ కౌన్సిలర్ అనపురం శ్యామ్, సుధాకర్, జ్యోతి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభ కలిగిన విద్యార్థులకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్..**

**కేసముద్రం,ఆగస్టు 14:**



కేసముద్రం మండలం కల్వల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు కెనరా బ్యాంక్ అందించే కెనరా విద్యా జ్యోతి పథకం స్కాలర్షిప్ కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ కెనరా బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా శిక్షిత్ భారత్, వికసిత్ భారత్ లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే ఎస్సీ,ఎస్టీ విద్యార్థినిలకు ఆర్థిక సహాయం అందజేస్తు న్నట్లు అమనగల్ కెనరా బ్యాంక్ మేనేజర్ అజ్మీర జగన్, ఫీల్డ్ ఆఫీసర్ కొడారి శరత్ చంద్ర వెల్లడించినట్లు తెలిపారు. అందులో భాగంగానే కల్వల పాఠశాల షెడ్యూల్డ్ ట్రైబ్ విద్యార్థినిలు ధరావత్ నవ్య, అజ్మీర్ నిహారిక, బాదావత్ మేఘన, బానోత్ ఝాన్సీ, భూక్య కావ్య, బాదావత్ అనూష లు ఎంపికైనట్లు ప్రకటించారు.



ఆరు,ఏడు తరగతుల విద్యార్థినిలకు రూ.3 వేల చొప్పున 8వ, తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.5 వేల చొప్పున 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అందజేయ నున్నట్లు బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడానికి కెనరా బ్యాంక్ లాంటి సంస్థలు వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువులో బాగా రాణించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండారు నరేందర్ విద్యార్థులకు సూచించారు. తమ పాఠశాల విద్యార్థులను ఎంచుకున్నందుకు అమనగల్ కెనరా బ్యాంక్ అధికారులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాచకొండ ఏకాంబరం, బేతి సత్యనారాయణ, తండ సదానందం, వేముల నాగేందర్, రాగి బిక్షపతి,ఎం.యాకాంబరం,వి.రాజేంద్ర చారి, కొడారి రాములు, మార్గం శ్రీనివాస్, కే.పార్వతి, జుబేర్ అలీ, ఫిజికల్ డైరెక్టర్ కొప్పుల శంకర్,జి. నాగరాజు, ఆవుల లింగయ్య,సీఆర్పి ఉదయ్ కుమార్, ఎస్ సునీల్, ఎస్ రాధ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ

**బయ్యారం, మేజర్ న్యూస్. సూర్య,ఆగస్టు 14.**

బయ్యారం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని మండల అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని మండల కేంద్రంలోని రామాలయం సెంటర్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడం, చైతన్య పరచడం కోసం హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిపై జెండా ఎగరవేయాలని,ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచిపోయేలా హర్ ఘర్ తిరంగ్ ఉండాలన్నారు. ఆపరేషన్ సింధూర్ తో శత్రు దేశాలతోని భారతదేశాన్ని కాపాడడంలో ముందున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల శ్రీనివాస్, ఊకె రామ్మూర్తి,వన్నం రామారావు,దాసరి క్రాంతి,బీజ్జా కనకయ్య, అడుపు జైప్రసాద్ కురియాల చంద్రయ్య,నద్దునూరి మంగమ్మ,రామ్ నివాస్, దేరంగుల రాంబాబు, చాట్ల లక్ష్మీపతి, బానోత్ శ్రీనివాస్, గుగులోత్ శ్రీనివాస్, లూనావత్ శ్రీనివాస్, రేఖ ఉప్పలయ్య,దారావత్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు




**బయ్యారం, మేజర్ న్యూస్ సూర్య ఆగస్టు 14.**

బయ్యారం మండలం జగ్గు తండా గ్రామపంచాయతీలో వివిధ పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలోకీ మండల అధ్యక్షులు తాతా గణేష్ ఆధ్వర్యంలో కొమ్మరాజుల నాగరాజు తన అనుచరులు, ఇతర పార్టీ నాయకులతో కలిసి బిఆర్ఎస్ పార్టీలో 65 కుటుంబాలతో చేరారు. పార్టీలో చేరిన వారికి ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ మాట్లాడుతూ బ్యాంకుల్లో బకాయిలు ఉన్న ప్రతి రైతుకు ?2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చి 18 నెలలైనా దానిని పూర్తిగా అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం రెండు పంట సీజన్లలో రైతులకు ఎకరానికి ?7,500 పెట్టుబడి ఇస్తామని హామీ ఇచ్చారు,కానీ రైతులకు ఎకరానికి ?6,000 తగ్గించిన కానీ మొత్తాన్ని అందరి రైతులకు ఇవ్వడంలో విఫలమయ్యారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 సహాయం యొక్క భవితవ్యం ఏమిటో తెలియదు,మహిళలకు నెలకు ?2,500 సహాయం,పేద కుటుంబాలలోని ఆడపిల్లల పెళ్ళికి ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారం,కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ కింద వారి వివాహానికి ?1 లక్ష ఆర్థిక సహాయం,సామాజిక భద్రతా పెన్షన్‌ను నెలకు ?2,000 నుండి ?4,000 కు పెంచడం వంటివి వదిలేశారు. వరికి బోనస్ కూడా చాలా మంది రైతులకు ఇవ్వలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకు కుల సర్వే పేరుతో వెనుకబడిన వర్గాలను మోసం చేశారని హరిప్రియ కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగుల సత్యనారాయణ,ఏనుగులు ఐలయ్య, బానోత్ శ్రీను,బానోతు లక్ష్మణ్ నాయక్, నీలారపు సంపత్,గుగులోత్ రామకోటి,రేపాకుల వెంకన్న, జరుపల శ్రీను, ఇస్లావత్ వీరన్న,అజ్మీరా సునీల్,కొండల్,శోభన్, బండమీది సంపత్,రేఖ యాకన్న,కీర్తి ఉదయ్,సందీప్,లెనిన్, వీరబాబు, ఎల్లయ్య,అర్జున్,మహేష్,సందీప్,అనిల్ రాజేష్ పార్టీ మండల నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# పానుగంటి కృష్ణ - జయశ్రీ నూతన దంపతులకు ఆశీర్వాదము శుభాకాంక్షలు

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**దేవరుప్పుల ఆగస్టు 14 మేజర్ న్యూస్ (సూర్య):**

దేవరుప్పుల మండలంలోని పెద్దమడూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ యువజన నాయకుడు, సోషల్ మీడియా వారియర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రియ శిష్యుడు పానుగంటి కృష్ణ - జయశ్రీ వివాహ వేడుక గురువారం దేవరుప్పుల మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్స్ లో నిర్వహించగా ఆ వివాహ మహోత్సవానికి హాజరై నూతన దంపతులకు పట్టు వస్త్రాలు అందజేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో వారి



వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశ్ మాజీ ఎంపిపి కొల్లూరి సోమయ్య మండల కార్యదర్శి చింత రవి మండల ముఖ్య నాయకులు ఏల సుందర్ మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్ మండల నాయకులు కొత్త జలేందర్ రెడ్డి ఈదునూరి నర్సింహారెడ్డి కుతాటి నర్సింహులు పానుగంటి గిరి గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారు రాములు తాటిపెల్లి మహేష్ తోటకూరి కిష్టయ్య గోలి ఉప్పల్ రెడ్డి షీల తిరుమలేష్ తాళ్లపల్లి మహేష్ సంజీవ రెడ్డి యాకు సంపత్ నరేందర్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు సోషల్ మీడియా వారియర్స్ గ్రామస్తులుపాల్గొన్నారు.

## జర్నలిస్ట్ సుమన్ రెడ్డి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ఓదార్పు..

**బయ్యారం, మేజర్ న్యూస్ సూర్య,ఆగస్టు 14.**

బయ్యారం మండల వార్త రిపోర్టర్,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సంకపల్లి సుమన్ రెడ్డి మతృమూర్తి లక్ష్మమ్మ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ సుమన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి వారి అమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్,గంగుల సత్యనారాయణ, ఏనుగులు ఐలయ్య,బానోత్ శ్రీను, బానోతు లక్ష్మణ్ నాయక్, నీలారపు సంపత్ యాదవ్,రేపాకుల వెంకన్న,జరుపల శ్రీను,ఇస్లావత్ వీరన్న, అజ్మీరా సునీల్,నీలారపు సంపత్ యాదవ్,కీర్తి ఉదయ్,చందు సందీప్,క్యాస సందీప్, కసనపోయిన సతీష్, వీరబాబు,ఎల్లయ్య,లెనిన్, అర్జున్,మహేష్,అనిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

